23062025-DIS-04_Layout 1 6/23/2025 1:57 AM Page 1

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

అక్షర వెలుగు

చీకటి మా బతుకులు వెలుగుని కోరుతున్నాయి...
వెలుగు మాత్రం అక్షరంతోనే వస్తానంటుంది!

ఓ అక్షరమా... నాతో అడవికొస్తావా?
అక్షరాలు కలిస్తేనే పదాలుగా మారతాయి...
ఓ పదమా నాతో మా పల్లెకొస్తావా?
పదాలన్నీ కలిస్తేనే వాక్యమవుతుంది...
ఓ వాక్యమా నాతో మా వాడకొస్తావా?
వాక్యాలన్నీ కలిస్తేనే గేయమవుతుంది...
ఓ గేయమా.. నాతో మా గూడెంకొస్తావా?
నువు లేక మా బతుకులు అక్కడే ఆగిపోయాయి..
అక్షరం లేక ఆగిపోయిన బతుకులు మావి!

ఓ అక్షరమా.. నాతో పాటు మా అడవికొస్తావా?
ఓ అక్షరమా.. నాతో పాటు మా పల్లెకొస్తావా?
ఓ అక్షరమా.... నాతో పాటు మా వాడకొస్తావా?
ఓ అక్షరమా... నాతో పాటు మా గూడెంకొస్తావా?
ఓ అక్షరమా... నాతో పాటు మా బస్తీకొస్తావా?

నీ కోసం తరాల నుండి వేచి
చూస్తున్న బతుకులు ఎన్నో ఉన్నాయి...
నువు రావాలని బతిమాడుతలేను,
నువు రావడం నా హక్కని అడుగుతున్నాను!
నీ రాకకై వేచి చూస్తుంటా...

పోరిక వికాస్
63039 69215

నా తోడుగ నీవుంటే..

(గజల్)

నా తోడుగ నీవుంటే
స్వర్గము నా కెందుకూ
నాతో నువు లేని ఏ
స్వర్గము నా కెందుకూ ||నాతో||

నీ అందమైన నగుమోమూ
నా యెదుటే ఉండగా
నింగిలోని చందమామ
బింబము నాకెందుకూ ||నాతో||

గల గల గల మాటలాడె
నీవే ఇట నుండగా
పారుతున్న సెలయేరుల
పదనిస నాకెందుకూ ||నాతో||

నీ మాటల మార్దవమూ
నాతోనే ఉండగా
వినసొంపగు సంగీతపు
సరిగమ లింకెందుకూ ||నాతో||

నీ ఉనికే మరువలేని
ప్రశాంతతను ఇవ్వగా
నిశ్శబ్దపు పూలతోట
గాలులు నాకెందుకూ ||నాతో||

ఆమెతోడి జీవితమే
అందముగా నుండగా
ఇంద్రధనుసు రంగులింక
దామూ నీ కెందుకూ ||నాతో||

గిరిమాజి
దామోదర్
99663 36960

సమాజం మారుతున్న కొద్దీ విలువలు మారడం కాదు, మారుతున్న సమాజానికి అనుగుణంగా విలువలు శాశ్వతంగా ఉండేలా చూడాలి టీవీ ఛానళ్లు. ముఖ్యంగా మానవ ఔన్నత్యం కోసం ఆయా రంగాల్లోని నిష్ణాతులైన వారితో చర్చలు జరిపిస్తూ పరిపూర్ణ మానవ సమాజం కోసం పురాణ వాఙ్మయం నుంచి కానీ, ఆధునిక సాహిత్యం నుంచి కానీ సందేశాలను తీసుకొని వాటిని ప్రదర్శించాలి. అలా అని మన జీవితాలను శాసించే ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు కాలంతో ఎలాగూ మారుతాయి! అదే సమయంలో ఈ సమాజం మనగడకు, వికాసానికి మీడియా మాధ్యమాలు శాశ్వత విలువలను ఎప్పుడూ ఏదో ఒక రూపంలో అందిస్తూనే ఉండాలి.

బాబోయ్ బుల్లితెర



ధారావాహికల్లో (సీరియళ్లు).. హింస, పరపీడనం, డాబు- దర్పాల ప్రదర్శన, ఒకరి మీద మరొకరు కుట్రలు, కుయుక్తులు చేసుకోవడం, పన్నాగాలు పన్నడం, హత్యా ప్రయత్నాలు, చిన్న పిల్లల వయసుకు మించి డైలాగులు చెప్పించడం తప్ప ఇంకేమీ కనిపించడం లేదు. దీనివల్ల 'ఇలాగే ఉండాలేమో?' అని ప్రేక్షకులు అనుకరించే ప్రయత్నం చేస్తారు. ముందుముందు కూడా ఇదే పోకడలకు పోతే సమాజం విచ్ఛిన్నమవుతుంది.

ఇంతకాలం పురాణాలతోనో, నాటకాల ద్వారానో, పాటల ద్వారానో, శతకాల ద్వారానో నీతినియమాలు, ధర్మ లక్షణాలు చెప్పించి, వాటిని శ్రోతలు, పాఠకుల మనసుల్లోకి ఎక్కించేవారు. అలా స్థిరంగా ఆచరించడం వల్లనే వ్యవస్థ పరంగాను, సంస్కృతి పరంగాను, వారసత్వ పరంగానూ వేల సంవత్సరాల నుంచి భారతదేశం కుటుంబ విలువలను నిలుపుకొంటూ వస్తున్నది.

రానురాను నాటకాల ప్రదర్శనలు తగ్గిపోయాయి. ప్రేక్షకుల ఆదరణ లేకపోవడం, ప్రదర్శనల ద్వారా వారికి తగినంత ఆదాయం రాకపోవడం అందుకు ప్రధాన కారణాలు. శాస్త్ర సాంకేతిక రంగాలు దూసుకురావడం, వేగం పెరగడం, ప్రజలు కూడా ఉరుకుల పరుగుల జీవితానికి అలవాటు పడటం మొదలైన కర్ణుడి చావుకు అనేక కారణాల వలెనే... స+హితం=సాహిత్యం కాస్తా 'కు' హితం అవుతున్నది. ఈ నేపథ్యంలోనే సీరియళ్లు దూసుకువచ్చాయి. అయితే, వాటి పోకడ మరీ దారుణంగా తయారైంది. సీరియళ్లలో ఆడవాళ్ల దుర్మార్గాలు, దాష్టీకాల వల్ల సమాజంలో తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయి. ప్రస్తుత కుటుంబాలపై వాటి ప్రభావం ఎంతో ఉన్నది.

'ఇవన్నీ తెలిసి మీరెందుకు సీరియల్ చూస్తున్నారు?' అని ఎవరైనా నన్ను ప్రశ్నించవచ్చు. అందులోని మంచి చెడులను చెప్పడానికి నేనూ సీరియళ్లు చూస్తాను. ఆది శంకరుల వంటివారు కూడా ఉభయభారతితో వాదనలో శృంగారపరమైన చర్చ వచ్చినప్పుడు కాస్త గడువు కోరి రాజు శరీరంలో పరకాయ ప్రవేశం చేశారు. ఏదైనా విషయం గురించి మంచి, చెడు చెప్పాలంటే మనకు తొలుత తెలిసి ఉండాలి కదా!

మహిళలకు క్రూర మనస్తత్వం ఉన్నట్టు సీరియళ్లలో చూపించడం వల్ల మహిళలకే నష్టం. ఒక సీరియల్‌లో చిన్న కోడలు గయ్యాళి వలె, మరొక సీరియల్‌లో పెద్ద కోడలు బ్రహ్మరాక్షసి వలె, మరోచోట చదువుకున్న కోడలు దుష్టురాలి వలె, ఇంకో సీరియల్‌లో చదువుకున్న అత్తగారు క్రూరురాలి వలె, ఇలా అన్ని సీరియళ్లలో మహిళా ప్రతినాయికల (విలన్) పాత్రలను సృష్టిస్తున్నారు. ఇక వారి చర్యలెలా ఉంటాయంటే.. ఇదివరకే వివాహమైన వ్యక్తికి మరో వివాహం చేయాలని ప్రయత్నించడం, సదరు వ్యక్తి ధర్మచారిణిని తరిమేయాలని పన్నాగాలు పన్నడం.. లాంటి సీన్లు ఎక్కువగా ఉంటాయి. ఏక పత్నీవ్రతుడిగా కీర్తిపొందిన రాముడు కుటుంబాలకు ఇచ్చిన విలువల భరిణ రామాయణం. దాన్ని తునా తునకలు చేయడమే సీరియళ్ల పన్నాగమా? లేక పంతమా?

పురుషుల పాత్రలు మాత్రం సందేశాత్మకంగానే ఉంటాయి. పురుషుల పాత్రలను నోట్లో నాలుక లేని వారుగానో, లేక మరీ మంచితనాన్ని ప్రదర్శించేవారుగానో చిత్రీకరిస్తారు. కానీ, సీరియళ్లలో ఆడవారి మాటలెలా ఉంటాయంటే.. 'అది ఎట్లా చేస్తున్నదో చూడు', 'దాన్ని జుట్టు పట్టు లాగి కొట్టాలి' అనే డైలాగ్‌లు కనిపిస్తుంటాయి. విష ప్రయోగాలు చేయడం, లేదా కాలో, చెయ్యో విరగ్గొట్టి మంచంలో పడేసి, కాపురం చేయకుండా చూడాలని, నూనె డబ్బాలను మెట్ల మీద కుమ్మరించడం, లేదా ఫెన్సింగ్‌కు కరెంటు షాక్ వచ్చేలా అమర్చడం... లాంటి సీన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవే కాకుండా చేతబడులు, క్షుద్రపూజలు చేయించడం, మంత్రాలు-తంత్రాలు, మాయలు, మన్ను-మశానం అన్ని ప్రయత్నిస్తుంటారు. ఇలా మూఢనమ్మకాలను పెంచి వందల ఏండ్లు వెనుకకు ప్రేక్షకులను తీసుకుపోవడం మంచిదేనా? అసలవన్నీ చూపించవచ్చా? నాటక లక్షణాలు వారికి తెలియవా? దేన్ని చూపించాలనేది చానళ్లు పాటిస్తున్నాయా? నియమ నిబంధనల గురించి చానళ్లకు తెలియదా? దర్శక-నిర్మాతలకు తెలియదా?

పూర్వకాలంలో విలువలు పట్టు తప్పిపోతున్న ప్రతీసారి ఎవరో ఒక మహాత్ముడు ఆధ్యాత్మిక గురువై తమ బోధనలతో మళ్లీ ఆ విలువలను నిలబెట్టే ప్రయత్నం చేసేవారు. అలా పూర్వం అనసూయ, అరుంధతి లాంటి మునిపత్నులు ఆడవారికి మంచి-చెడుల తారతమ్యం చెప్పి జ్ఞానులను చేసేవారు. వాటిని సీత, ద్రౌపది వంటివారు విని ఆచరించి చూపారు. అలా ఈ మహిళామణుల స్థానంలో టీవీ చానళ్లు ఆకట్టుకునే సీరియళ్లతో మైత్రీ పూర్వక కథనాలను ప్రదర్శించి, ఆ విలువలను నిలబెట్టాలి. అలా సామాజిక జీవితంలో శాశ్వత విలువలకున్న ప్రాధాన్యాన్ని చెప్పాలనుకుంటే ఎవరినీ కించపరచకుండానే చెప్పవచ్చు. ఉదాహరణకు మందర లాంటి ఆయా పాత్రలకు సముచిత స్థానాన్ని ప్రాముఖ్యాన్ని లోగడ కూడా ఇచ్చేవాళ్లు. ఇప్పుడు కూడా అలా ఇస్తూ సీరియల్

హిందూ వ్యవస్థకు ఉన్న పవిత్రతను పోగొట్టి కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసే సీరియళ్లను చూసినవారు ఏం కావాలి? ఎందుకంటే ఫ్యామిలీ టైమ్ అని కలిసి ఫ్యామిలీ రూంలో కూర్చొని టీవీ ఆన్ చేస్తే వచ్చే సీరియళ్లు ఇవే కదా? మరి అవి భార్యల సంతృప్తి కోసం కూర్చొని చూస్తారు. ఎలాంటి సంతృప్తి అంటే? పిల్లలు ఉద్యోగరీత్యా దూరప్రాంతాల్లో ఉంటే దంపతులు రోజూ బయటకు పోలేరు. కనుక టీవీల్లోనే సమయం గడుపుతారు. అలా ఉపయోగపడుతున్నాయి సీరియళ్లు. అలాంటప్పుడు సీరియల్ అవసరమే కదా? అని అంటారేమో? సీరియళ్లు ఆపేయాలని కాదు నేను చెప్పేది. అందులో నేరాలు- ఘోరాలు తగ్గించుకుంటే కాస్త మంచిదేమో? అని నా అభిప్రాయం.

ఒకతను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. ఆ విషయం తల్లికి నచ్చదు. తన కొడుక్కి ఎలాగైనా రెండో పెళ్లి చేయాలని, ఆ ఇంట్లో కారణం లేకుండానే ఉండే తమ్ముడి కూతురిని తన కొడుకుకు కట్టబెట్టాలని, అందుకు కోడలిపై ఏదో ఒక నేరం మోపి ఇంట్లోంచి వెళ్లగొట్టాలని, తెగ ప్లాన్లు వేస్తూ ఉంటుంది ఓ అత్త. నిజ జీవితంలో ఎంత కోపమున్నా కూడా ఇలా తన కుటుంబసభ్యులను చావగొట్టాలని చూస్తారా? లేదా అంగవైకల్యం వచ్చేలా చేయాలనుకుంటారా? ఇలాంటి వాటిని లీనమై చూస్తున్నారు కొంతమంది ప్రేక్షకులు. ఇంకా రేపు ఏం జరుగుతుంది? ఆ పిల్ల చస్తుందా? లేక దాని కాలు విరుగుతుందా? అని ఆడవాళ్లను తిట్టుకుంటూ కొంత మంది మగవారూ చూస్తారు. ఉత్కంఠ రేపి వదిలేస్తారు.

సీరియళ్లు వినోదాత్మకంగా ఉండి మనసుకు హాయి కలిగించి సేదతీర్చేలా ఉండాలి. సమాజాన్ని కదిలించేలా చైతన్యవంతమైన కథలతో సందేశాత్మకంగా ఉండాలి. ముఖ్యంగా, ఆడ విలన్లను తగ్గిస్తే మంచిదని నా అభిప్రాయం. ఒకవేళ దుష్ట స్త్రీల గురించి చెప్పాలనుకొంటే మన ఇతిహాసాల్లో, పురాణాల్లో దుష్ట పాత్రలు లేవా? వాటి వలె చిత్రీకరించి, ఏది చెప్పినా బుజ్జగించినట్టు చెప్పాలి. ఎందుకంటే ఈ సమాజంలో ఇదివరకే చాలామంది భార్యా బాధితులున్నారు. వారు మరో రకంగా హింసింపబడుతున్నారు. పెళ్లికాని 40 సంవత్సరాల బ్రహ్మచారులు, పెళ్లికాని ప్రసాదులున్నారంటే సర్దుకుపోయే మనస్తత్వం ఉన్న ఆడపిల్లలు కరువయ్యారనే కదా అర్థం! చాలామంది మహిళలు సీరియళ్లకు వ్యసనపరులై పోతున్నారు. వారు ఒక్క రోజు కూడా చూడకుండా ఉండరు.

రంగరాజు పద్మజ
99897 58144

జీవితంలో రోజు ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం కనుక్కొనేందుకు మంచి మాటలు లేదా మంచి నడవడికతోనే ఎలా చెప్పాలని ఆలోచించాలి. ఎందుకంటే మానవుల పరస్పర బంధాలతో కలిసి చేసే పనులు, నేర్పరితనంతో చేసే పనులకు వీటి వల్ల గండిపడి శాంతిని కోల్పోతారు. మానవ ఐక్యతలోపించి, ఎన్నో కష్టాలకు దారితీస్తుంటాయి. ఇలాంటి వ్యాకులత కలిగించే సీరియళ్ల స్థానంలో పనులు చేసి అలసిపోయిన వారికి ప్రశాంతతను కలిగించే కథనాలను ప్రసారం చేయాలి.

ఏ కావ్యం రాసినా, ఏ నవల రాసినా, సాహిత్య ప్రక్రియలో ఏది రాసినా మానవ కల్యాణమే లక్ష్యంగా సాగాలి. అంతే తప్ప ద్వేషాలు- పగ-ప్రతీకారాలతో సీరియళ్లు తీస్తే, రోజూ వాటిని పదే పదే చూపెడితే ఆ ప్రభావం కొద్ది కొద్దిగా మనిషిని మృదు స్వభావం కోల్పోయేలా చేస్తుంది. మొరటుగా మారుస్తుంది. నిజ జీవితంలోనూ సాటివారిని హింసించవచ్చని అనిపించవచ్చు. అప్పుడు ఆ సీరియల్ దుష్ప్రభావం చూపిందనే అనుకోవాల్సి ఉంటుంది.

అందరూ అలాంటి అత్తాకోడళ్లే ఉన్నారనుకోవద్దు. అయినా సరదాగా చూసేవారూ ఉన్నారు. కాకపోతే దానికన్నా ప్రమాదం ఏమంటే సీరియళ్లు చూడటం అంటువ్యాధిగా మారడం. ఆ వేళకు బంధువు వచ్చినా పగవాడిగా అనిపిస్తాడు. లేదా తన పిల్లలో, భర్తనో క్రికెట్ చూడాలని రిమోట్ ఇవ్వమంటే... వారి మీద వీరికి వచ్చే కోపం అంతా ఇంతా కాదు. ఇలాంటి వారి సంఖ్య ఎక్కువవుతున్నది. టీవీ చానళ్లు ఏదో కాలక్షేపం కోసం హింసా ప్రవృత్తి ఉన్న సీరియళ్లను తీస్తున్నాయిలే అని ఎవరికి వారే ఉదాసీనంగా ఊరుకుంటే ఎలా? అటువంటి ఫార్ములాతో ఓ సీరియల్ విజయవంతమైందని అనుకోండి! మరో నిర్మాత అలాగే కుట్రలు నిండిన సీరియల్ తీసి దానికి రేటింగ్ పెరిగితే, మళ్లీ నేర ప్రవృత్తి ఉన్న మహిళలను కథా నాయికలుగా చేసి మరో సీరియల్ తీస్తారు. అలా కాకుండా మంచి కథనాలతో ప్రబోధాత్మకంగా, వినోదాత్మకంగా, టీవీ ముందు కొంత సమయం గడిపినా ఏదో ఒకటి నేర్చుకోవడమో, తెలుసుకునేలా సీరియళ్లు ఉండాలి. అప్పుడే మానసిక ఆందోళనలు కలగకుండా ప్రశాంతంగా ఉండవచ్చు. ■

వాన కోసం కప్పల కావడి

'కప్పల కావడి' ఓ జానపద కళారూపం. రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు ప్రాంతాలలో, తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రస్తుత గద్వాల్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, మహబూబ్ నగర్ ప్రాంతాలు, కర్ణాటకలోని రాయచూర్ ప్రాంతం తెలుగు రాష్ట్రంతో సరిహద్దు పంచుకుంటున్న ప్రాంతాలలో కొన్ని చోట్ల అప్పటినుంచి ఇప్పటిదాకా కరువు కాటకాలతో అలమటించే ప్రాంతాలు. ఈ ప్రాంతాలలో వాన రాక కోసం ఆబాలగోపాలం వరకు ఎదురుచూసేవారు. వాన దేవుడిని మెప్పించి రప్పించడానికి ఈ ప్రాంతాల్లో ఈ జానపద కళారూపం ప్రచారంలో ఉండేది. సకాలంలో వానలు కురవాలి. అలా కురవకపోతే నష్టం, అరిష్టం అనే వాదం వేదకాలం నుంచి నేటిదాకా వానల కోసం చేసే పూజలు, జరిపే తంతు, నడిపే సంబురాలు కోకొల్లలు.

తెలుగునాట గ్రామీణులు వాన దేవుడి రాక కోసం జరిపే ఆచారాలలో ఈ కప్పల కావిడి తంతు ఒకటి. వానకూ కప్పలకు లంకె ఉన్నది. వానలు పడితే చెరువులు నిండుతాయి. 'తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు' అని బద్దెన అన్నట్టు వాన వస్తే కప్పలు చెరువు నిండా చేరుతాయి, వాన వస్తే సరే, మరి వాన రాకపోతే? కప్పలను పురమాయించి వానలను తెప్పించాలి. అందుకే తెలుగు వారు వానల కోసం కప్పాలమ్మ కప్పల దేవర, కప్పతల్లీ సంబురాలు చేస్తారు. కప్ప తల్లికి పెళ్లి చేస్తారు. వరుణదేవుడు కప్పతల్లి పెళ్లికి కావిళ్లతో నీళ్లు పంపుతాడట. వాడలన్నీ నింపుతాడట. కప్పతల్లి గడప తొక్కితే శుభసూచకంగా భావిస్తారు పెద్దలు. కప్ప ఎగిరితే పొలంలో వానలు పడి బంగారం పండుతుందని రైతన్నల విశ్వాసం.

వర్షాలు సకాలంలో పడనప్పుడు ఆది హిందువులైన స్త్రీలు ఒక బోదురు కప్పను పట్టుకొని, పసుపు రాసి, కుంకుమ బొట్లు పెట్టి పసుపు గుడ్డతో రోకలి మీద పెట్టి, కట్టి, ఒక కావడి భుజాన వేసుకొని రెండు తట్టల్లో కప్పలను పెట్టి అవి ఎగిరిపోకుండా వేప మండలు వేసి ఇద్దరు వక్తులు దాన్ని మోసుకొంటూ ఊరంతా తిప్పుతారు. వీళ్లవెంట కొందరు పేరంటాళ్ళు పళ్లెంలో పసుపూ, పువ్వులూ, పత్రీ పట్టుకుని కోలన్న పుల్లలతో వాయిస్తూ అందరూ ఒక్కసారిగా ఒక పాటను పాడుతారు.



వానదేవుడా వానదేవుడా
వానలు కురిపించు వానదేవుడా
||వాన||
కప్పతల్లి నీళ్ళాడె
కడవల నిండనీళ్ళొచ్చె
మొర్రో వానదేవుడా
||వాన
దోమ తల్లీ నీళ్ళాడే
దొరపుల నిండా నీళ్ళొచ్చె
మొర్రో వానదేవుడా
||వాన||
చేపతల్లీ నీళ్ళాడే
చెరువుల నిండా నీళ్ళొచ్చె
మొర్రో వానదేవుడా వాన
తూరుపున మొయిలు చుట్టి వానదేవుడా
తుంపరులు రావాలి వానదేవుడా
చిన్న చిన్న తుంపరలు వానదేవుడా
చెలరేగి కురవాలి వానదేవుడా
జడివాన రావాలి వానదేవుడా
సాగాలి కాలువలు వానదేవుడా
చెరువులన్ని నిండాలి వానదేవుడా
చేలన్నీ పండాలి వానదేవుడా
అందవయ్య దణ్ణాలు వానదేవుడా
అందరిని బతికించు వానదేవుడా...

ఇలా కప్పాలమ్మను పాట పాడుతూ ఊరేగిస్తూ చెరువు దగ్గరికి చేరుతారు. సంబురం చివర కప్పను చెరువులో వదలుతారు. నీళ్ళాడు అనే మాట ప్రసవించడానికి జాతీయం. కప్పతల్లి ఒక్కత్తే కాదు ఆమెతో పాటు ఈగతల్లి, దోమ తల్లి, చేప తల్లి, ప్రకృతి అంతా ప్రసవించాలని కోరుకుంటూ ఈ తంతు నిర్వహిస్తారని ఆరుద్ర (గుడిలో సెక్స్)లో పేర్కొన్నారు.

కర్నె మల్లికార్జున్
6303744239

ఇలా కప్పల కావిడిలాగే వాన కోసం జానపదులు చేసే జాతరలు చాలా ఉన్నాయి. ఊరు ఊరంతా కలిసి వలస జాతర చేస్తారు. దీన్నే గంపజాతర, వరదపాసెం, వనభోజనం అంటారు. వాన కోసం ఊరు విడిచి అడివిలోకి వెళ్లాలి. అక్కడ వండుకొని తినాలి. ఈ జాతరలలో గాలి దేవరను, వలస దేవరను పూజిస్తారు. ఊరి బయట పరమాన్నం వండి, ఎత్తయిన ప్రదేశంలో వరుణ దేవున్ని అహ్వానం చేస్తూ ఈ పరమాన్నాన్ని ఒక బల్ల మీద వారపోస్తారు. దానిని దేవ ప్రసాదంగా ప్రతి వారూ తీసుకొని కళ్లకద్దుకొని తింటారు. దీనినే వరదపాశం అంటారు. వన భోజనంలో సాలదేవర్ని పూజిస్తారు. ఇలా రాయలసీమ, తెలంగాణ, కర్ణాటకలలో కొన్ని ప్రాంతాలలో కరువు సంభవించిన సమయంలో కానీ, వానకాలం ముందు కానీ ఇలాంటి కప్పల కావిడి జానపద కళారూపాన్ని ప్రదర్శించేవారు.

పుస్తకావిష్కరణ

2025, జూన్ 28వ తేదీన శనివారం సాయంత్రం 6 గంటలకు కరీంనగర్ ఫిల్మ్‌భవన్‌లో కూకట్ల తిరుపతి రచించిన 'మొలాటు' పుస్తకావిష్కరణ జరుగనున్నది. సీవీ కుమార్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ హాజరుకానుండగా, ప్రముఖ కవి కందుకూరి అంజయ్య పుస్తక పరిచయం చేస్తారు. ఆత్మీయ అతిథులుగా బూర్ల వెంకటేశ్వర్లు, బుర్ర తిరుపతి, దామరకుంట శంకరయ్య, తోట నిర్మలారాణి, బసవేశ్వర్ పాల్గొంటారు.

- తెలంగాణ రచయితల వేదిక, కరీంనగర్

పురస్కారం-2025

డాక్టర్ వేదగిరి కథానికా సేవకు గుర్తింపుగా 2017 నుంచి ఏటా యువ రచయితలకు డాక్టర్ వేదగిరి రాంబాబు కథానికా పురస్కారాన్ని అందజేస్తున్నాం. ఈ క్రమంలోనే 2025, అక్టోబర్ 14 నాటికి 40 మించని రచయితల నుంచి కథానికా సంపుటాలను (ప్రచురణ ఎప్పుడు జరిగినా ఫరవాలేదు) ఆహ్వానిస్తున్నాం. సంపుటాలను 2025, ఆగస్టు 14వ తేదీ లోపు 'సింహప్రసాద్ సాహిత్య సమితి 401, మయూరి ఎస్టేట్స్, ఎంఐజీ 2-650, కేపీహెచ్‌బీ, హైదరాబాద్-72' చిరునామాకు పంపాలి. వివరాలకు 98490 61668.

'బందారం కథలు సమాలోచనం'

2025, జూన్ 23వ తేదీ సాయంత్రం 7.30 నిమిషాలకు 'తెలంగాణ రచయితల సంఘం', 'జంట నగరాలు కవి వారం' ఆధ్వర్యంలో డాక్టర్ నందిని సిధారెడ్డి రాసిన కథల పుస్తకం 'బందారం కథలు'పై సమావేశం జరుగనున్నది. ఈ అంతర్జాల సభకు కందుకూరి శ్రీరాములు అధ్యక్షత వహించనుండగా, కాట్రగడ్డ దయానంద్ ప్రధాన ప్రసంగం చేస్తారు. టేకులపల్లి గోపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బెల్లంకొండ సంపత్ కుమార్, సోమవారం కవి సమ్మేళనం కవి మిత్రులు చర్చలో పాల్గొంటారు.

- కందుకూరి శ్రీరాములు
94401 19245

సాహిత్య గ్రంథాల దిక్సూచి

తెలంగాణ సాహిత్య అకాడమీ చేపట్టిన అనేక ప్రాజెక్టులలో 'తెలంగాణ సాహిత్య గ్రంథ సూచి' నిర్మాణం ఒక బృహత్కార్యక్రమం. ఇలాంటి సాహితీ ప్రాజెక్టులకు ప్రధానంగా విషయ సేకరణ ఒక యజ్ఞం లాంటిది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ సాహిత్యపరంగా తన అస్తిత్వాన్ని, మూలాలను పలు పార్శ్వాల నుంచి అన్వేషించుకుంటూ మరుగున పడిన వైభవాన్ని పునర్నిర్మాణం చేసుకునే దిశగా సాగుతున్నది. తన వంతు బాధ్యతగా తెలంగాణలోని మేధావులు, కవులు, రచయితల, సాహితీవేత్తల సృజనను బయటి ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరాన్ని సాహిత్య అకాడమీ గుర్తించి 'తెలంగాణ సాహిత్య గ్రంథ సూచి'ని తీసుకురావాలనే ఆలోచన చేసింది. అప్పటి అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి, తొలి కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి వారి నిర్ణయాత్మకమైన ఆలోచనను సాకారం చేస్తూ అట్టెం దత్తయ్య ప్రధాన సంపాదకత్వంలో, సహ సంపాదకులు డాక్టర్ యెల్చాల నర్సింలు, డాక్టర్ మ్యాతరి ఆనంద్, వర్ధ వేణుల సహకారంతో ఈ గ్రంథ సూచి కార్యక్రమంలో అనేక సమస్యలు ఎదురైనా విజయవంతంగా పూర్తిచేయడం గొప్ప విషయం. కార్యనిర్వాహక సంపాదకులుగా అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి వ్యవహరించగా, ఆచార్య వెలుదండ నిత్యానంద రావు చెప్పినట్టుగా ఈ సూచి ఆధారంగా ఏయే ప్రాంతాల్లో ఎలాంటి స్పందన లభించిందో గమనించవచ్చు. స్థానిక ప్రసిద్ధులను గుర్తించవచ్చు. ఈ సాహిత్య గ్రంథ సూచిలో రచయిత పేరు, గ్రంథం పేరు, ప్రక్రియ, ప్రచురించబడిన సంవత్సరం, పుటలు, వెల, ప్రచురణ సంస్థ ఇత్యాది వివరాలను పట్టిక రూపంలో పొందుపరిచారు. 706 పేజీలలో దాదాపుగా 14,120 పైచిలుకు గ్రంథ వివరాలున్నాయి. అన్నిరకాల సాహిత్య ప్రక్రియలు వచన కవిత, కథలు, పాటలు, శతకాలు, వచనాలు, జీవిత చరిత్రలు, మోనోగ్రాఫ్, నాటకం, గేయాలు, పరిశోధనలు, కావ్యాలు, ఉద్యమ చరిత్రలు, ఆధ్యాత్మిక రచనలు, యక్షగానం, నవల, యాత్రా చరిత్ర, విమర్శ, అనువాదాలు, వ్యాసాలు, బాల సాహిత్యం ఇంకా ఇతర రచనా ప్రక్రియల విషయాలను సేకరించి ఇచ్చారు. ఈ విషయ సేకరణ వాటి ప్రచురణ ద్వారా తెలంగాణ ప్రాంతంలో వెలుగు చూడని అన్ని ప్రక్రియలలోని సాహిత్య గ్రంథాలను ఒకచోట చేర్చి సాహితీ ప్రపంచానికి అందజేసే అవకాశం లభించింది.

ఒక జాతి బహుముఖీనమైన సమగ్రాభివృద్ధిలో సంస్కృతి, సాహిత్యాలది ప్రముఖ స్థానం. భాషా సాహిత్యాలు ఒక జాతి వికాసానికి ముఖ్యాంగాలనడం అతిశయోక్తి కాదు. వర్తమాన తరానికి దిశానిర్దేశం చేసేవిధంగా అనేకమైన విశేష సాహితీ కార్యక్రమాలు చేపట్టడమే గాక అరుదైన గ్రంథాలను ప్రచురించి అందుబాటులో ఉంచుతూ ముందుచూపుతో అనేక సాహితీ ప్రాజెక్టులను కూడా భవిష్యత్తు ప్రణాళికలుగా వేసి నడిపించిన సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు నందిని సిధారెడ్డి నిబద్ధత, ముందుచూపు హర్షించదగినది. వారి బాటలోనే నడుస్తూ ఈ బృహత్ ప్రయత్నాన్ని నడిపించిన డాక్టర్ నామోజు బాలాచారికి, బాధ్యతలను భుజానికెత్తుకొని కార్యాన్ని సాధించినందుకు ప్రధాన సంపాదకులు అట్టెం దత్తయ్య బృందానికి అభినందనలు. ■

డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్
99088 40186